నీటి సమస్యను పరిష్కరించాలి

జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌ గృహ కల్పలో నీటి సమస్యపై బుధవారం జలమండలి కార్యాలయంలో ఆ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా తమ కాలనీలో తీవ్ర నీటి సమస్య ఉందని, వీలైనంత తొందరగా పరిష్కరించాలని మాజీ అధ్యక్షులు ప్రభాకర్‌ కోరారు. అంతేకాకుండా విద్యుత్‌ బిల్లు అధికంగా వస్తుందని, దీనిపై కూడా చర్చించి ఉచితంగా నీటి సరఫరా అయ్యేట్లు చూడాలని కాలనీవాసులు కోరారు.

పార్కును ప్రజా అవసరాలకు ఉపయోగించాలి

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ ప్రగతి నగర్‌లో సర్వే నెంబర్‌ 178, 179 నందు ఓ ప్రైవేట్‌ స్కూల్‌కు ఆనుకుని ఉన్న మూడు ఎకరాల పార్క్‌ స్థలాన్ని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని బీజేపీ మున్సిపల్‌ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్‌ను కలిసి కోరారు. ఆ పార్కులో ఒక ప్రైవేట్‌ స్కూల్‌కు సంబంధించి అక్రమ పార్కింగ్‌, పార్కులో కన్‌స్ట్రక్షన్‌ మెటీరియల్‌ డంపింగ్‌ చేయడం, స్కూల్‌ప్లే గ్రౌండ్‌గా ఉపయోగించుకోవడం, పార్కులో స్కూల్‌ డ్రైవర్స్‌కు అక్రమ నిర్మాణం చేపట్టి నివాసం ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారు. అధికారులు పార్కును స్వాధీనం చేసుకుని ఆ పార్క్‌కి స్వామి వివేకానంద పేరు నామకరణం చేయాలన్నారు. కమిషనర్‌ స్పందించి.. అధికారులను పంపించి గేట్లకు తాళం వేయించడమే కాకుండా అక్రమ పార్కింగ్‌ తీసివేయించారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, చందు, ముఖేష్‌, ఎల్లస్వామి, అశోక్‌, దశరథ్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్‌ జగన్‌

జగద్గిరిగుట్ట : డివిజన్‌ పరిధిలోని రింగుబస్తీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బడిబాట అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్పొరేటర్‌ కొలుకుల జగన్‌ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. .కార్యక్రమంలో హెచ్‌ఎం కమల, ఉపాధ్యాయులు రేఖ, సుష్మ, జితేందర్‌, షణ్ముఖ, పాపయ్య గౌడ్‌, మల్లారెడ్డి, మహేందర్‌ రెడ్డి, హనుమంతు, యాదగిరి, వెంకటేష్‌, బసవేశ్వర్‌, సంపత్‌ రెడ్డి, సిద్దులు, శాంతి, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్య సేవలు



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్‌ సత్యనారాయణ

సుభాష్‌నగర్‌: సీఎం రిలీఫ్‌ ఫండ్‌తో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సూరారం డివిజన్‌ కార్పొరేటర్‌ సత్యనారాయణ అన్నారు. టీఎస్‌ఐఐసీ కాలనీకి చెందిన రామచందర్‌(57)కు ఎమ్మెల్యే సహకారంతో రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బుధవారం చింతల్‌లోని కార్యాలయంలో కార్పొరేటర్‌ సత్యనారాయణ లబ్ధిదారుడికి అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిద్దిక్‌, సురేష్‌, బషీర్‌ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



గాంధీనగర్‌ జడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడా కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్‌

రంగారెడ్డినగర్‌: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కార్పొరేటర్‌ విజయశేఖర్‌గౌడ్‌ అన్నారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని గాంధీనగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, చెన్నారెడ్డినగర్‌లోని ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు ఆయన స్పోర్ట్స్‌ కిట్లను అందజేశారు. చెస్‌ బోర్డులు, షటిల్‌, త్రోబాల్‌ తదితర క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటల పట్ల శ్రద్ధ చూపాలని, క్రీడలపై మక్కువ పెంచుకుంటే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లాలి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌
- కలెక్టర్‌ మిక్కిలినేని మను చౌదరి
- బాచుపల్లి, భౌరంపేట్‌ ఉన్నత పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ మను చౌదరి

నిజాంపేట్‌: విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని, చదువుతోపాటు సమాజ జ్ఞానంతోనే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం జిల్లాలోని బాచుపల్లి, భౌరంపేట్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని పదవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కృషి, పట్టుదల క్రమశిక్షణే విజయానికి కారణమన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్‌ లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని కలెక్టర్‌ సూచించారు. అనంతరం విద్యార్థులు స్కూల్‌లో స్పోర్ట్స్‌ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఎగుడుదిగుడుగా ఉన్న గ్రౌండ్‌ను లెవల్‌గా చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్‌ సానుకూలంగా స్పందించారు. పాఠశాలకు ఏమి కావాలో ఒక నివేదిక తయారు చేసి తనకు అందించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్‌ చట్టాలతో కార్మికులను నిలువు దోపిడీ చేసేందుకు యత్నిస్తోందని సీఐటీయూ కుత్బుల్లాపూర్‌ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌ అన్నారు. ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని బుధవారం షాపూర్‌నగర్‌లో సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటీష్‌కాలంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్‌ కోడ్‌లతో కార్మికుల హక్కులను హరించివేస్తోందని ఆరోపించారు. హమాలీ కార్మికులకు ఆరోగ్య బీమా, పని భద్రత, ప్రమాద బీమా పథకాలను వర్తింపచేయాలని, వెంటనే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో 10 కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు పాల్గొంటున్నాయని, ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శీను, కరుణాకర్‌, మల్లారెడ్డి, పాషా, నర్సింహులు, యాదవరెడ్డి, సాధులు, కనకయ్య, శ్రీశైలం, వీరేష్‌, తిమ్మప్ప, దుర్గా నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

చింతల్‌: విద్యుత్‌ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌ బోయిన్‌పల్లి సంచారపురి కాలనీ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంచారపురి కాలనీ, పబ్లిక్‌ సెక్టర్‌ కాలనీ, ఉమానగర్‌ కాలనీ, రిలయన్స్‌ విల్లాస్‌ అపార్ట్‌మెంట్స్‌, ముస్లిం బస్తీ, వాయునగర్‌, తెలంగాణ గార్డెన్స్‌ తదితర ప్రాంతాలు, విమల్‌ (ఇండియన్‌ ఎయిర్‌ ఫోర్స్‌) ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సంతోషిమాత టెంపుల్‌ రోడ్డు, ఫతేనగర్‌ పైపులైన్‌ రోడ్డు, రాములు పిటి, మొక్కపాటి టవర్స్‌, బండలగడ్డ పిటి, అన్నపూర్ణ ఫుడ్స్‌, భగత్‌సింగ్‌ పార్క్‌, ఫతేనగర్‌ ఫోర్త్‌ బ్లాక్‌, స్వరూప అపార్ట్‌మెంట్స్‌, ఫతేనగర్‌ ఫోర్త్‌ బ్లాక్‌, డీటీఆర్‌ 2 కేబుల్‌ బ్లాక్‌ 1, బ్లాక్‌ 2, జాన్సన్‌ గ్రామర్‌ స్కూల్‌, ఫతేనగర్‌, నవభారత్‌ స్కూల్‌, ఫతేనగర్‌ ఫోర్త్‌ బ్లాక్‌, ఫతేనగర్‌ ఫిఫ్త్‌ బ్లాక్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగనుందని తెలిపారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

చింతల్‌: ఒక ఉద్యోగికి తను పనిచేస్తున్న చోట నుంచి మరో చోటికి బదిలీ కావడం సహజమని కుత్బుల్లాపూర్‌ వాటర్‌ వర్క్స్‌ ఇన్‌చార్జి జీఎం ఎం.మాధవి అన్నారు. కుత్బుల్లాపూర్‌ వాటర్‌ కార్యాలయం చింతల్‌ డీజీఎంగా పనిచేస్తున్న ఎస్‌ రాజేష్‌ బదిలీ అయ్యారు. 2020 అక్టోబర్‌లో డీజీఎంగా పదోన్నతి పొంది చింతల్‌కు వచ్చిన ఆయన నేడు డివిజన్‌ 3 (షేక్‌పేట్‌)కు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం డివిజన్‌ కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎంలు, మేనేజర్లు కార్యాలయం సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీజీఎంగా మాధవి

రాజేష్‌ డివిజన్‌-3 కి బదిలీపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి జీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎం.మాధవి చింతల్‌ డీజీఎంగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మాధవి మంగళవారం వరకు సైనిక్‌పురిలో డీజీఎంగా కొనసాగుతున్నారు. దీంతో కుత్బుల్లాపూర్‌లో డీజీఎం, ఇన్‌చార్జి జీఎంగా ఒకే ప్రాంతంలో కొనసాగుతారు.

నేడు బాచుపల్లిలో రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్‌: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిజాంపేట్‌ కార్పొషన్‌ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వేడుకల్లో నియోజవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి పాల్గొంటారని, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంస్థల నాయకులు హాజరు కావాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన



ఆయుష్మాన్‌ హెల్త్‌ కార్డులను అందజేస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌ నాయక్‌

దుండిగల్‌: వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్‌ కార్యాలయంలో మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌ నాయక్‌ ఆధ్వర్యంలో వేస్ట్‌ పిక్కర్స్‌ ప్రొఫైలింగ్‌ క్యాంపు (చెత్త వేరుకునే వారికి) నిర్వహించారు. ఈ సందర్భంగా 'నమస్తే స్కీం' కింద ఆయుష్మాన్‌ హెల్త్‌ కార్డులను జారీ చేశారు. అదే విధంగా దుండిగల్‌ వార్డ్‌ ఆఫీసు నందు కళా జాతర ప్రోగ్రాం నిర్వహించి ఇళ్ల వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కోరారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో యాంటీ లార్వా మందులను చల్లుతున్నామని, నివాసితులు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్‌ నమస్తే ప్రోగ్రాం ఆఫీసర్‌ మల్లేష్‌, మున్సిపల్‌ ఇంజినీర్‌ సురేందర్‌ నాయక్‌, ఎన్విరాన్మెంట్‌ ఇంజినీర్‌ సాత్విక్‌, వార్డ్‌ ఆఫీసర్లు, మెప్మా మహిళా గ్రూప్‌ సభ్యులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

– బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: బోనాల పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత (రిజి స్ట్రేషన్‌) కలిగిన ఆలయ కమిటీలకు నిధుల కోసం ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులను చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు కమిటీ లెటర్‌ప్యాడ్‌, బ్యాంక్‌ ఖాతా వివరాలు, సభ్యుల ఆధార్‌ కార్డు ప్రతులు, ఆలయానికి సంబంధించిన 3 ఫొటోలు, ప్రతీ కాపీపై కమిటీ స్టాంపు ముద్రించి జతపర్చాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



జగద్గిరిగుట్ట: డివిజన్‌లోని షిరిడీహిల్స్‌లో హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ అధ్యక్షులు విజయ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో భాగ్యలక్ష్మి ఫౌండేషన్‌ జనరల్‌ సెక్రటరీ మాణిక్‌ చారి బుధవారం 50వ జన్మదినాన్ని దివ్యాంగుల మధ్యలో జరుపుకున్నారు. దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట ఏఎస్‌ఐ నన్నే మియా హాజరయ్యారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భాగ్యలక్ష్మి ఫౌండేషన్‌ అధ్యక్షులు భాగ్యలక్ష్మి, అశోక సంఘం అధ్యక్షులు ఏసుబాబు, మదర్‌ థెరిస్సా ఫౌండేషన్‌ అధ్యక్షులు శ్రావణ్‌ కుమార్‌, రమ, విజయ శంకర్‌, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి నాలా మురుగు!

జీడిమెట్ల: ఓపెన్‌ నాలా ఔట్‌లెట్‌ మూసుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతుంది. దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్‌ డివిజన్‌ వెంకటాద్రినగర్‌ రోడ్డు నెంబర్‌ 3లో వారం రోజులుగా నాలా నుంచి మురుగునీరు ఔట్‌లెట్‌ మూసుకుపోవడంతో రోడ్డుపైకి వస్తుంది. ఈ విషయమై కాలనీవాసులు కుత్బుల్లాపూర్‌ మున్సిపల్‌ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శానిటేషన్‌ సిబ్బంది పట్టించుకుని మురుగునీరు భూగర్భ డ్రైనేజీ ద్వారా సక్రమంగా వెళ్లేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమ నిర్మాణాలు కూల్చివేత

సుభాష్‌నగర్‌: పోలీస్‌ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు బుధవారం పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. గాజుల రామారం డివిజన్‌ రావి నారాయణరెడ్డి నగర్‌, గాలి పోచమ్మ బస్తి సర్వే నంబర్‌ 307 వెలిసిన ఇళ్లను, బేస్మెంట్‌, ప్రహరీలను డిప్యూటీ తహసీల్దార్‌ మల్లికార్జునరావు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గులాం కలీం నేతృత్వంలో భారీ బందోబస్తు వద్ద నేలమట్టం చేశారు. ముందుగా రావినారాయణరెడ్డినగర్‌ ఆనుకుని ఉన్న సర్వే నంబర్‌ 307లో 5 గదులు, ఒక ప్రహరీ, 2 బేస్‌మెంట్లు, గాలి పోచమ్మ బస్తీలో 3 గదులు, ఒక ప్రహరీని కూల్చి వేశారు. కూల్చివేయడానికి వచ్చిన రెవెన్యూ అధికారులతో స్థానికులు వాగ్వివాదానికి దిగారు. కళ్లముందే తాము నివాసముంటున్న ఇల్లు కూలిపోవడంతో వారి రోదనలు మిన్నంటాయి.

● నీటి వృథా !



జగద్గిరిగుట్ట: గోదావరి నీళ్లు వృథాగా పోతున్నాయి. గంటల తరబడి నీటి సరఫరా అవుతుండటంతో ఇండ్లలో ఉండే నీటి సంపులు నిండి రోడ్లపై పారుతున్నాయి. సంపులు నిండిన తర్వాత నల్లాకు వాల్వ్‌ బిగించుకోకపోవడమే కాకుండా అదే నీటితో వాహనాలు కడుక్కోవడంతో పాటు నీటిని రోడ్లపై వదులుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటివృథా అరికట్టాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బాచుపల్లి గ్రామంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం ఉపాధ్యక్షులు వెల్దండ నిత్యానందరావు, రిజిస్ట్రార్‌ కోట్ల హనుమంతరావులను ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మాదిగ కలిశారు.

– నిజాంపేట్‌

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్‌ వైద్యం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న శంభీపూర్‌ కృష్ణ

దుండిగల్‌: సీఎం రిలీఫ్‌ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్‌ వైద్య సేవలు అందుతున్నాయని దుండిగల్‌ మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌, బీఆర్‌ఎస్‌ నేత శంభీపూర్‌ కృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు మంజూరు చేయించిన రూ.29,9500 చెక్కులను బుధవారం ఆయన శంభీపూర్‌లోని కార్యాలయంలో 8 మంది లబ్ధిదారులకు అందజేశారు. మాజీ కౌన్సిలర్‌ విష్ణు వర్ధన్‌ రెడ్డి, నాయకులు మాదాస్‌ నవీన్‌, రంజిత్‌ రెడ్డి, బాలకృష్ణ, అశోక్‌, ప్రవీణ్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజులో నాలుగు దైవ దర్శనాలు

జీడిమెట్ల డీఎం ఆంజనేయులు

జీడిమెట్ల: టీఎస్‌ఆర్‌టీసీ ప్రయాణికులకు ఒక్క రోజులో చాలా ప్రాంతాలు తిరిగేలా గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జీడిమెట్ల డీఎం ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్‌ 27 నుంచి పుణ్యక్షేత్రాల దర్శనం ఒక్కరోజు యాత్రను ప్రారంభించనున్నారు. 27న ఉదయం 5 గంటలకు మెట్రో డీలక్స్‌ బస్సు దుండిగల్‌ నుంచి ప్రారంభించనున్నారు. జోగులాంబ అమ్మవారి దర్శనం, పురాతన బాల బ్రహ్మేశ్వరస్వామి గుడి, పురాతన శివాలయాలు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం ముగించుకుని రాత్రి 11గంటలకు తిరిగి దుండిగల్‌ చేరుకుంటుంది. టూర్‌ ప్యాకేజీ పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.600 వందలుగా నిర్ణయించారు. టిఫిన్‌, భోజనం, దర్శనం టికెట్లు ఖర్చులు ప్రయాణికులు భరించాల్సి ఉంటుందని తెలిపారు. 27వ తేదీ తర్వాత ఒక్కరోజు యాత్ర ప్రతి శని, ఆదివారాల్లో దుండిగల్‌ నుంచి ప్రారంభమై గండిమైసమ్మ, షాపూర్‌నగర్‌, చింతల్‌, జగద్గిరిగుట్ట, బాలానగర్‌, జేబీఎస్‌ మీదుగా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జీడిమెట్ల డిపో పరిధిలోని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. 35 నుంచి 40 మంది యాత్రికులు ఉంటే బస్సును నేరుగా కాలనీకి పంపుతామని తెలిపారు. ప్రయాణికులు వివరాల కోసం ఫోన్‌ నెంబర్లు 9959226150, 944092583, 9959615886, 8106309252లతో పాటు డీఎం ఆంజనేయులు 9959959931 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన ఉండాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు

జీడిమెట్ల: మహిళలు రొమ్ము కేన్సర్‌ బారిన పడకుండా ఉండాలంటే ప్రతి సంవత్సరం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త వనిత దాట్ల అన్నారు. బుధవారం సూరారంలోని లుయిస్‌ బ్రెయిలీ భవనంలో గ్రాన్యూల్స్‌, ఏఐజీ, క్షత్రీయ వనితా వికాస్‌ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత రొమ్ము కేన్సర్‌ క్యాంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనిత దాట్ల హాజరై మాట్లాడారు. అనంతరం డాక్టర్‌ ప్రజ్ఞ మాట్లాడుతూ.. రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంచుకుని ముందస్తు పరీక్షలు నిర్వహిస్తే రొమ్ము తీసేయాల్సిన అవసరం ఉండదని అన్నారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పేదవారికి మేలు జరుగుతుందన్నారు. 200 మంది మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో క్షత్రీయ వనితా వికాస్‌ సభ్యులు ఇందుకూరి మోహన, సత్య, మాధురి, సుజాత, ప్రతిమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో విద్యార్థిని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్‌ : కొంపెల్లిలోని సెంట్రల్‌ పార్కు బాలికల వసతి గృహంలో బుధవారం ఫిజియోథెరపీ విద్యార్థిని చల్ల ప్రీతి ('22) ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని చంద్రశేఖర్‌కాలనీకి చెందిన చల్ల భూమయ్య, లక్ష్మి దంపతుల కూతురు హైదరాబాద్‌లోని యశోద ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫిజియోథెరపీ కాలేజీలో ఫిజియోథెరపీ కోర్సు చదువుకుంటుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రీతిని తల్లి లక్ష్మి నిజామాబాద్‌ ఆసుపత్రిలో మంగళవారం చూపించి హైదరాబాద్‌ పంపించింది. బుధవారం ఉదయం మృతురాలి ప్రీతికి వారి బంధువులు ఫోన్‌ చేయగా.. లిఫ్ట్‌ చేయలేదు. హాస్టల్‌ ఓనర్‌కు ఫోన్‌ చేసి చెప్పారు. మధ్యాహ్నం ఒకటిన్నర, రెండు గంటల సమయంలో హాస్టల్‌ ఓనరు హాస్టల్‌లోని పైగదికి వెళ్లి డోరు కొట్టగా ఓపెన్‌ చేయలేదు. డోర్‌ విరగ్గొట్టి లోపల చూడగా ఫ్యాన్‌కు ప్రీతి చున్నీతో ఉరివేసుకుంది. అనారోగ్య సమస్యల వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల వృద్ధికి తోడ్పాటు

రంగారెడ్డినగర్‌: తెలంగాణ జోనల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల వృద్ధికి పారిశ్రామిక వేత్తలకు వ్యాపార అవగహన సదస్సు బుధవారం బాలానగర్‌ బ్రాంచ్‌ కార్యాలయంలో జరిగింది. మేనేజర్‌ అరుణ్‌ కుమార్‌ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి జనరల్‌ మేనేజర్‌ మనోజ్‌ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనరల్‌ మేనేజర్‌ మాట్లాడుతూ.. తయారీ రంగంలో, సర్వీసు రంగంలో నూతన పరిశ్రమలు నెలకొల్పుతున్న నైపుణ్యం గల యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందిస్తామన్నారు. అనంతరం బ్రాంచ్‌ మేనేజర్‌ అరుణ్‌ కుమార్‌ మాట్లాడుతూ గృహ, ముద్ర రుణాలు తక్కువ వడ్డీ రేట్లకి ఇస్తున్నామని, నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా రూ.2 వేల పాలసీతో ఇరువై లక్షల డెత్‌ ఇన్సూరెన్సు పాలసీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమములో పారిశ్రామికవేతలు సత్యనారాయణ, వాకిటి రాంరెడ్డి, బ్యాంక్‌ సిబ్బంది సుధాకర్‌, సావిత్రి, సునీత, సుధా, అపర్ణ రమా పాల్గొన్నారు.

వృద్ధుడిని చేరదీసిన ఆటో డ్రైవర్లు



సుభాష్‌నగర్‌: కొంపల్లిలోని 44వ జాతీయ రహదారి దూలపల్లి చౌరస్తా ఆటో స్టాండ్‌ వద్ద మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన వృద్ధుడిని ఆటో డ్రైవర్లు చేరదీశారు. ఈ సందర్భంగా టీయూసీఐ కొంపల్లి ఏరియా వైస్‌ ప్రెసిడెంట్‌ వెంకటేష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. ఆ వృద్ధుడిని పలకరించగా తనది దూలపల్లి అని ఒకటే సమాధానం ఇస్తున్నాడని, మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడని తెలిపారు. ప్రతిరోజు అతనికి ఆహారాన్ని అందిస్తున్నామని, వృద్ధుడికి మతిస్థిమితం సరిగా లేదన్నారు. అతనికి సంబంధించిన వారు తమ ఆటో స్టాండ్‌ వద్దకు వచ్చి తీసుకెళ్లాలని తెలిపారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

కుత్బుల్లాపూర్‌: ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు తండ్రి మందలించడంతో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల పైపులైన్‌ రోడ్డులో నివాసముండే లింగప్ప కుమార్తె జ్యోత్స్న(14) స్థానికంగా ఉన్న పాఠశాలలో చదువుతోంది. బుధవారం స్కూల్‌ నుంచి ఆలస్యంగా ఇంటికి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక సాయంత్రం 4:20 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

540 గ్రాముల గంజాయి స్వాధీనం



నిందితుడు, సీజ్‌ చేసిన గంజాయితో ఎక్సైజ్‌ సీఐ యాదయ్య, సిబ్బంది

కుత్బుల్లాపూర్‌: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి నుంచి 540 గ్రాముల గంజాయిని కుత్బుల్లాపూర్‌ ఎక్సైజ్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ సీఐ యాదయ్య వివరాల ప్రకారం.. దుండిగల్‌లోని డబుల్‌ బెడ్‌రూం సముదాయంలో గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే కుత్బుల్లాపూర్‌ ఎక్సైజ్‌ పోలీసులు బుధవారం సాయంత్రం 3:30 గంటల సమయంలో బ్లాక్‌ నంబరు 27లోని ఫ్లాట్‌ నంబర్‌ 502పై దాడులు నిర్వహించారు. మహ్మద్‌ సల్మాన్‌ (21) అనే వ్యక్తి నుంచి 540 డ్రై గంజాయితో పాటు ఒక స్మార్ట్‌ ఫోన్‌ను సీజ్‌ చేశారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్‌ యాక్ట్‌-1985 కింద కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. దుండిగల్‌ సమీపంలోని విద్యార్థులకు గంజాయిని విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్‌ సీఐ యాదయ్య తెలిపారు.

పార్ట్‌నర్‌ మోసం చేశాడని ఆత్మహత్య



మురళీధర్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: 'నా చావు కారణం సత్యనారాయణగౌడ్‌.. నన్ను నమ్మించి పార్ట్‌నర్‌గా పెట్టుకొని నిలువునా మోసం చేశాడు. నాకు అక్షరాల 30 లక్షల రూపాయలు అతని వద్ద రావాలి. అమ్మ, నాన్న నన్ను క్షమించండి.. చిన్ని, స్వీటి, అర్జున్‌ బాగా చదువుకోండి.. భార్య లలిత నన్ను క్షమించు. నన్ను మోసం చేసిన వారి నుండి వచ్చే డబ్బులు, అదే విధంగా ఊరిలో కోర్టు వివాదంలో ఉన్న స్థలం పరిష్కారమైన తర్వాత నా భార్య పిల్లలకు ఇప్పించండి' అని ఐదుగురి పైగా పేర్లు రాసి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌ స్టేషన్‌లో జరిగింది. సీఐ భరత్‌ కుమార్‌ వివరాల ప్రకారం.. సూరారం కృషి కాలనీకి చెందిన మురళీధర్‌రెడ్డికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇతను తన మిత్రుడు సత్యనారాయణగౌడ్‌తో కలిసి జీడిమెట్లలో వినాయక ఇండస్ట్రీస్‌ను నిర్వహిస్తున్నాడు. అయితే మురళీధర్‌రెడ్డికి రావాల్సిన రూ.30 లక్షలు ఇవ్వకుండా గత కొంత కాలంగా సత్యనారాయణగౌడ్‌ వేధిస్తూ వస్తున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అతను తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఉదయం 6 గంటల సమయంలో పెంట్‌హౌస్‌ రాడ్డుకు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. ఘటనా స్థలంలో సుసైడ్‌ నోట్‌ లభించడంతో మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.